# భావవీచికలు: పేరులో 'నేము 'న్నది

జొన్నలగడ్డ శ్యామల, హైదరాబాదు

"గజంవంటయిందా లేదా?" పక్కింట్లోంచి కొత్త గొంతుక వినిపించింది.

ఖాళీగా వున్న పక్కింట్లోకి నిన్ననే కాబోలు కొత్త కుటుంబం దిగింది. ఆఫీసు తొందరలో నేను అంతగా పట్టించుకోలేదు. ఇదుగో, ఇప్పుడు ఈ పిలుపు . . . గజం ఏమిటి? ఏనుగు అనా లేక కోలమానంలో గజమా? అనుకున్నాను. ఆ తర్వాత రాత్రి పడుకునేలోపు ఆయన గజం, గజం అని ఓ యాభైసార్లయినా పిలిచాడు. ఎలా ఉంటుందో ఆమె, మనసులో ఓ చిలిపి ఊహ. మా ఆయనక్కూడా అదే ఆలోచన వచ్చినట్లుంది. ఇద్దరం నవ్వులు పూయించాం.

మర్నాడు ఉదయం పెరటిగోడ దగ్గర సన్నపాటి పొరుగింటామె ప్రత్యక్షమైంది నవ్వుముఖంతో.

నేనూ పలకరింపుగా నవ్వాను.

"మేం కొత్తగా ఈ ఇంట్లోకి వచ్చాం. ఆయన పులిహోర చెయ్యమన్నారు. మీ కరివేపాకు చెట్టు కనిపించింది. రెండు రెబ్బలు ఇస్తారేమోనని ఇటొచ్చా. ఆయన బజారునుంచి తెచ్చారు కానీ పెరటిచెట్టు ఆకు కమ్మగా ఉంటుందని. . . " ఆగింది ఓ క్షణం.

"దానికేం భాగ్యం" అని కరివేపాకు కోసి ఇస్తూ, "మీపేరు" అడిగాను.

"గజలక్ష్మి" అని ఆమె బదులిస్తుండగానే లోపల్నుంచి "గజం" అన్న కేక జగమంతా వినిపించింది.

"వస్తానండీ" అంటూ ఆమె వేగంగా వెనుతిరిగింది.

"లక్ష్మి అని పిలవొచ్చుగా ఆ మానవుడు" అనుకుంటూ సన్నగా నవ్వుకున్నాను.

టీ పెడుతున్నానే కానీ ఆలోచనంతా పేర్ల చుట్టూ తిరగసాగింది. పేర్లంటే గుర్తొచ్చింది. నా చిన్నప్పుడు ఓసారి మా ఇంటికి దూరపుబంధువు ఒకామె వచ్చింది. ఎవరు వచ్చినా మా నాన్న "మీ ఇంటిపేరేమిటి?" అన్న ప్రశ్న వేసేవాడు. ఆమెనూ అదే ప్రశ్న వేశాడు. ఆమె వెంటనే ఇబ్బంది, నవ్వు కలగలిపిన ముఖం పెట్టి ఏదో గొణిగింది. ఎవరికీ వినపడలేదు.

"ఏంటమ్మా?" నాన్న మళ్ళీ అడిగాడు. ఈసారి "ముష్టివారు" మెల్లగా గొణిగింది.

మాకు వినిపించినా మానాన్నకు వినపడలేదు. ఆయన వినిపించేదాక మరో రెండుసార్లు అడిగాడు. మేమెవరమన్నా గట్టిగా చెపుదామంటే వాళ్ళను ముష్టివాళ్ళన్నట్లుటుందేమో అని సంకోచం. చివరకు వాళ్ళ నాలుగేళ్ళ బాబు 'ముష్టివారు' అని అరిచాడు. నిజానికి వాళ్ళు భాగ్యవంతులే. ఇంటిపేరే అలా ఉంది. వాళ్ళు వెళ్ళిపోయాక అమ్మ, నాన్నను 'అన్నిసార్లు అడుగుతారేమిటి? కావాలని అన్నిసార్లు చెప్పించారనుకోరూ, వినపడకపోతే, తర్వాత మేం చెప్పేవాళ్ళంగా' అని విసుక్కుంది. 'తప్పేముంది అందులో' అన్నాడు నాన్న పరమశాంతంగా.

టీ అయిపోయి వంట మొదలెట్టాను. ఆలోచన మాత్రం పేర్ల చుట్టూ తిరుగుతోంది. ఒకప్పుడు దేవుళ్ళందరి పేర్లూ కలిపి చాంతాడంత పేర్లు పెట్టుకునేవాళ్ళు. వీర వరాహ వెంకట సత్యనారాయణ వరప్రసాదు వంటివన్నమాట. కొంతమంది తాతపేరు, నాయనమ్మపేరు పిల్లలకి పెట్టేవాళ్ళు. ఆ విషయమై భార్యాభర్తలు గొడవపడటం అందరిళ్ళలో సాధారణంగా జరిగేది. ఆ కాలంలో సరైన వైద్యసౌకర్యాల్లేక పిల్లలు పుట్టిపోయి, చివరకు ఒక్కరు బతికితే పుల్లమ్మ, పెంటయ్య వగైరా పేర్లు పెట్టుకునేవారు. కొంతమంది పెద్దయ్యాక పేరు నచ్చక ఎమ్మార్వో ఆఫీసుని సంప్రదించి పేరు మార్చుకోవటమూ కద్దు.

ఇప్పుడు అలాటి గొడవలేం లేవు. తమ పిల్లలకేం పేరు పెట్టుకోవాలో ముందరే పుస్తకాలు తిరగేసి, శబ్దరత్నాకరాలను వడపోసి, నెట్ లో గాలించేసి, ఇంకా ఓపిక ఉన్నవాళ్ళు రచయితల, కవులసలహా, సహకారాలు తీసుకొని సృజనాత్మకంగా పేర్లు పెడుతున్నారు. పెద్ద పేర్లు తగ్గాయి. చాలావరకు చిన్నపేర్లే ఉంటున్నాయి. అయితే కొత్త కొత్త అంటూ కొంతమంది విచిత్రమైన పేర్లు పెడుతున్నారు. ఉదాహరణకు 'వరస'. అది విని 'వర్ష' అనడానికి పొరపాటున అలా చెప్పారేమోనని మళ్ళీమళ్ళీ అడిగా. అది వరసేనన్నాడు. వాళ్ళ వరసనాకంతుపట్టలేదు. ఇంకో ఆయన పేరేమిటని అడిగితే 'నమస్తే' అన్నాడు. పేరు చెప్పకుండా నన్ను విష్ చేస్తున్నాడేమో అనుకున్నా. కానీ ఆయన పేరే 'నమస్తే' అట. నేను మనసులో 'నీకొక నమస్తే' అనుకున్నా.

ఇంకొక భావకుడు వాళ్ళ పాపకు 'సెలవు' అని పేరు పెట్టుకున్నాడు. ఏమిటి దానర్థం అంటే 'పాత భావాలకిక సెలవు' అని అంతరార్థం అన్నాడు. సరేనంటూ నేను సెలవు పుచ్చుకున్నాను.

ఒకప్పుడు సుబ్బారావు, సుబ్బలక్ష్మి, సీతామహాలక్ష్మి, అనసూయ వగైరా పేర్లు ప్రతి ఇంటా ఉండేవి. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంలో దేశభక్తితో చాలామంది స్వరాజ్యలక్ష్మి, భరత్, సామ్రాజ్యం, గాంధీ, తిలక్, నెహ్రూ. . . .వంటి పేర్లు పెట్టుకున్నారు. ఆపేర్లకు, వాళ్ళకు తర్వాత పొంతన లేకపోవటం అది వేరే సంగతి. గతంలో కొందమంది "మీ నామధేయం" అని ప్రశ్నిస్తే 'రామనాథం అంటారండీ' వంటి జవాబులు చెప్పేవాళ్ళు. నా చిన్నప్పుడు అది విని "ఎవరో అనడమేమిటి? తనపేరిది అని చెపితే కదా వాళ్ళు పిలిచేది" అనుకునేదాన్ని.

ఇంక ముద్దుపేర్లు తమాషాగా ఉంటాయి. బుల్లిపాప, చిన్నపాపాయి, చంటి . . . . . వగైరా. ఒకసారి ఎవరో 'బుల్లిపాపా' అని పిలుస్తుంటే అటువైపు చూపు సారించా. ఓ అరవై ఏళ్ళఆవిడ 'ఆ వస్తున్నా' నంటూ ముందుకొచ్చింది.

పేరులో ఏముంది? అని కొంతమంది అంటే పేరులోనే ఉన్నది పెన్నిధి

అని మరికొందరంటారు. పెళ్ళి తతంగాల్లో వధూవరుల గృహప్రవేశం సందర్భంలో పరస్పరం పేర్లు చెపితే కాని లోపలికి అడుగేయకూడదంటారు. బిడియం పోగొట్టేందుకు ఆ సంప్రదాయం పెట్టారంటారు. ఇదివరకు దానికో పావుగంట వ్యర్థమయ్యేది. చెప్పింది వినపడలేదని గొడవచేసేవాళ్ళు. ఇప్పుడయితే ఇదో పెద్దపనా అని ఠకీమని చెప్పి దూసుకుపోతున్నారు.

పేరు కాంక్షకయితే హద్దు, పద్దే ఉండటంలేదు. గిన్నెలమీద, సొమ్ములమీద, పేర్లు వేయించటం, ఇతరులకిచ్చేవాటిమీద పెద్ద అక్షరాలతో పేర్లు రాయించడం పరిపాటి. బహుమతుల చదివింపులు కొన్ని పెళ్ళిళ్ళలో ఓ పెద్ద ఘట్టంగా ఉంటుంది. 'ఫలాని మీ చిన్న మామ ఆరునూతల అర్ధనారీశ్వరరావు వధూవరులనాశీర్వదించి చదివిస్తున్న వేయి నూట పదహార్లనో, గృహోపకరణం మిక్సీ 'అనో బ్రహ్మగారిచేత మైకులో చెప్పిస్తుంటారు. ఆ అధునిక కాలంలో ఇ పద్ధతి కొంత పాతబడిందనుకోండి.

గుళ్ళలో అయితే 'ఈ ఫ్యాను దాత ఫలానా కోటీశ్వరరావు' అని, ఈ మార్బుల్ స్టోన్ల దాత ఫాలానా గుప్తాజీ అని రాసి ఉంటాయి. ఫ్యాన్ల మీద అయితే పెద్ద జోకే ఉంది. ఒకాయన ఫ్యాను మీదే పేరు రాయించాడుట. ఒకసారి ఎంతోమంది అక్కడ వుండగా ఆయన చటుక్కున వెళ్ళి ఫ్యాను ఆపేశాడట. ఎందుకంటే, ఫ్యాను తిరుగుతుంటే ఆయన పేరు ఎవరికీ కనబడదని. ఇంకపెళ్ళికార్డులలో 'అభినందనలతో' అని ఎవరినీ నొప్పించని మార్గాన్ని ఎంచుకుంటారు. కొంతమందికి పత్రికల్లో పేరు కనబడాలని తగని ముచ్చట. ఒకాయన అయితే ఆయన పేరు మాత్రమే కాకుండా తన బంధువర్గంలోని వాళ్ళందరి పేర్లతో జోక్స్ వగైరా పంపుతూ అందరి పేర్లు అచ్చులో చూసుకునేందుకు సంవత్సరాల తరబడి ప్రయత్నం చేస్తూనే వున్నాడు.

వంట పూర్తయింది. నా ఆలోచన కూడా ఒక కొలిక్కి వస్తోంది. . . పేర్లమాట అలావుంచి, 'పేరొందటం' వ్యవహారం ఎంతో శోచనీయంగా ఉంటోంది. మంచికో, చెడుకో దేనికైనా ఒ.కె., 'పేరొందటమే ముఖ్యం' అనే భావన జనంలో బలపడటమే. 'రాముడు పేరొందాడు, రావణుడు పేరొందాడు' అనుకుంటున్నారే గానీ ఆ వ్యత్యాసంపట్ల అభ్యంతరాలు ఈ రోజుల్లో రద్దయిపోతున్నాయి. పెట్టుకున్న పేరు ఎంత గొప్పదైనా దానికి వన్నెతెచ్చేలా నడచుకోనంతవరకూ అది నామమాత్రమే అవుతుంది. పేరు ఎంత సాధారణమైనదైనా ఆ వ్యక్తి మంచి, మానవతతో నడచుకుంటే ఆ పేరే మరెందరికో ఆదర్శంగా నిలుస్తుంది.

(జొన్నలగడ్డ శ్యామలగారు 22 ఏళ్ళుగా పత్రికారంగంలో పనిచేస్తూ ప్రస్తుతం "వార్త" తెలుగు దినపత్రికకు ఛీఫ్‌సబ్ ఎడిటర్‌గా వుంటున్నారు. 60కి పైగా కథలు, అనేక వ్యాసాలు, పుస్తక సమీక్షలు రాశారు. 'పూతరేకులు, సాధన, సాలోచనమ్' శీర్షికలతో కాలమ్స్ నిర్వహించారు. ఈదేశానికి విజిటర్‌గా వచ్చి 'తెలుగు జ్యోతి' చదివి, ఆనందించిన శ్యామలగారు కొన్ని నెలలుగా 'భావవీచికలు' శీర్షికను మన పాఠకులకు అందిస్తున్నారు.)